నమస్తే తెలంగాణ
కామారెడ్డి
3 | నిజామాబాద్, శుక్రవారం 16 ఆగస్టు 2024 | KAMAREDDY

నిజామాబాద్ జిల్లాకేంద్రంలో జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్

హామీలకు కట్టుబడి ఉన్నాం..

స్వాతంత్ర్యం సిద్ధించడంలో మహనీయుల త్యాగాలు ఉన్నాయని, ఆ త్యాగాల స్ఫూర్తిని, మహోన్నత విలువలను ప్రతి తరానికి తెలియజేయాలని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. నిజామాబాద్‌లో జెండా ఎగుర వేసే అవకాశం తనకు రావడం అదృష్టంగా, గర్వంగా భావిస్తున్నానని అన్నారు. నిజామాబాద్ అంటే వ్యవసాయం, నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ, గల్ఫ్ కార్మికులు అని వివరించారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీకి త్వరలోనే పూర్వ వైభవం వస్తుందన్నారు. గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. అనంతరం రాజీవ్ ఆరోగ్యశ్రీ, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి తదితర పథకాలను వివరించారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నాం..

ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువు తీరిందని, ప్రజల ఆశలు, ఆకాంక్షలు ఈ ప్రభుత్వంతోనే నెరవేరుతాయని ప్రజలు విశ్వసించారని అన్నారు. ప్రజలకు స్వేచ్ఛ,సమాన అవకాశాలు,సామాజిక న్యాయం అందుబాటులో ఉండడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఆరు గ్యారెంటీల కోసం రెండు లక్షల 94వేల 799 దరఖాస్తులు, 13,367 ఇతర సమస్యలపై వినతులు వచ్చినట్లు తెలిపారు. మండల పరిషత్ ఆఫీసులు,మున్సిపల్ కార్యాలయాల్లో 33 ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ సింధూశర్మ, మున్సిపల్ చైర్పర్సన్ ఇందూప్రియ పాల్గొన్నారు.

అయోమయం.. అంతా నిర్లక్ష్యం

త్రివర్ణ సంబురం

- ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు
- ముఖ్య అతిథి సొంత ప్రసంగంతో ఆశ్చర్యం
- మధ్యలోనే వెళ్లిపోయిన బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు

ఉమ్మడి జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. నిజామాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, కామారెడ్డి ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ హాజరయ్యారు. జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై శకటాల ప్రదర్శన, ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.

– కామారెడ్డి/ కంఠేశ్వర్, ఆగస్టు 15

కంఠేశ్వర్, ఆగస్టు 15 : జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో గురువారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అయోమయం నెలకొన్నది. వివిధ కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కనిపించింది. దీంతో వేడుకలు తిలకించేందుకు వచ్చినవారంతా అసహనానికి గురయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్.. జిల్లా ప్రగతిపై అధికార యంత్రాంగం ధృవీకరించిన ప్రసంగాన్ని పక్కన పెట్టి సొంతంగా మాట్లాడడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రసంగ కాపీలను చేతిలో పట్టుకున్న వారందరూ గందరగోళానికి గురయ్యారు. ఇదిలాఉండగా స్వాతంత్ర్య పోరాటం, గాంధీ హత్యపై వ్యాఖ్యలు చేసిన సందర్భంలో బీజేపీ ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది.

వెలవెలబోయిన స్టాళ్లు.. ఉద్యోగుల అసహనం

పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన స్టాళ్ల నిర్వహణలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. కొన్ని శాఖల స్టాళ్లు లేకపోవడం, ఏర్పాటు చేసిన స్టాళ్లలో సరైన సమాచారం లేకపోవడంతో ప్రముఖులు, విద్యావంతులు, విద్యార్థులు నిరాశగా వెనుదిరిగారు. వేడుకలను తిలకించేందుకు తక్కువ సంఖ్యలోనే జనం వచ్చారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఉద్యోగులు సైతం నిరాశకు గురయ్యారు. ప్రశంసాపత్రాలను ఒక్కొక్కరికీ ఇవ్వకుండా.. శాఖలో ఉన్న ఉద్యోగులందరికీ కలిపి ఒకేసారి ఇవ్వడంతో అసహనానికి గురయ్యారు. అధికారికి ప్రశంసాపత్రం చాలా విలువైనదని, అది వ్యక్తిగతంగా అందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. కనీసం కలెక్టర్ అయినా ఇవ్వాలని అడిగిన కొందరికి నిరాశే ఎదురైంది. చీఫ్ గెస్ట్ వెళ్లిపోయారని, ఆయనే ఇస్తే బాగుంటుందని కలెక్టర్ అనడంతో ఉద్యోగులు నిరాశతో వెనుదిరిగారు. చేసేదేమీ లేక పలువురు ఉద్యోగులు తమ శాఖల అధికారులతో ప్రశంసాపత్రాలు స్వీకరించి ఫొటోలు తీసుకోవడం కనిపించింది.

నిజామాబాద్‌లో కమిషనర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని స్వీకరిస్తున్న మున్సిపల్ ఉద్యోగి జి.రవళిక

కామారెడ్డిలో జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి

నిజామాబాద్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థినులు

కామారెడ్డిలో సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థినులు

ఎమ్మెల్యేల నారాజ్?
జెండా ఆవిష్కరణలో దక్కని గౌరవం
కార్పొరేషన్ చైర్మన్లకే సర్కారు పెద్దపీట
8

బాల్కొండలోని క్యాంప్ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మేయర్ నీతూ కిరణ్, రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు

జాతీయ జెండాఎగురని బోధన్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం

ఈసారీ జాతీయ జెండా ఎగురలేదు..

బోధన్, ఆగస్టు 15: బోధన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం జాతీయ జెండా ఎగురలేదు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన క్యాంప్ కార్యాలయం ప్రస్తుతం నిర్మానుష్యంగా ఉన్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యాలయం మూతపడగా, గేట్లకు తాళాలు వేశారు. గత జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా కూడా జాతీయ జెండాను ఎగురవేయలేదు.

మూడో విడుత రుణమాఫీకి రూ.190.33 కోట్లు

ఖలీల్‌వాడి, ఆగస్టు 15 : రైతు రుణమాఫీలో భాగంగా మూడో విడుత నిధులను ప్రభుత్వం విడుదల చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సాజిద్ హుస్సేన్ తెలిపారు. అర్హులైన రైతుల జాబితాను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 15,724 మంది రైతులకు రూ. 190.33 కోట్లు విడుదలైనట్లు తెలిపారు.

ప్రొటోకాల్ పట్టదా?

అధికారిక వేదికపై కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డి, ఆగస్టు 15 : ప్రభుత్వంలో ఉన్నది మా పార్టీనే.. మమ్మల్ని అడిగేవారు ఎవరున్నారని అనుకున్నారేమో ఈ కాంగ్రెస్ నేతలు. అధికారిక కార్యక్రమంలో ప్రొటోకాల్‌ను ఉల్లంఘించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో గురువారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చోటు చేసుకున్నది. వేదికపై అధికారులు, ప్రజాప్రతినిధులకు మాత్రమే సీట్లను కేటాయిస్తారు.. కానీ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, ఎల్లారెడ్డి నియోజకవర్గ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి వేదికపై కూర్చున్నారు. టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సమక్షంలోనే ప్రొటోకాల్‌లో లేని కాంగ్రెస్ నాయకులు వేదికపై కూర్చోవడంపై పలువురు విస్మయం వ్యక్తంచేశారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమా? లేక కాంగ్రెస్ పార్టీ కార్యక్రమమా అం టూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఆ పార్టీ నాయకులు ప్రొటోకాల్ పాటించకుండా అన్నింటా తామే అన్నట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రొటోకాల్ నిబంధనలు ఉల్లంఘిస్తూ వేదికపై కూర్చున్న కైలాస్ శ్రీనివాస్, సుభాష్‌రెడ్డి

నీటిని వృథా చేయొద్దు..

పోచారం ప్రాజెక్టు నుంచి నీటిని వదులుతున్న అధికారులు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 15 : రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని నీటి పారుదల శాఖ సీఈ శ్రీనివాస్ సూచించారు. పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ గేట్ల నుంచి ఆర్డీవో ప్రభాకర్‌తో కలిసి గురువారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ పోచారం ప్రాజెక్టులో 16ఫీట్లు, 1.1టీఎంసీ నీరు ఉన్నదని, నాలుగు విడుతల్లో నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల ఆయకట్టు రైతులకు సాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. నీరు తక్కువగా ఉండడంతో పొదుపుగా వాడుకోవాలన్నారు. గతేడాది పోచారం ప్రాజెక్టు పొంగి పొర్లడంతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 25 టీఎంసీల నీరు చేరిందన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం నాలుగు టీఎంసీల నీరు నిల్వ ఉన్నదని తెలిపారు. చివరి దశలో పంటలు ఎండిపోయే పరిస్థితి వస్తే కొండపోచమ్మ సాగర్ జలాశయం నుంచి 2.5 టీఎంసీల నీరు వదిలేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. నీటి పారుదల శాఖ ఎస్ఈ పద్మావతి, ఈఈ మల్లేశ్, డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ శ్రీకాంత్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరానికి విద్యార్థి బలి

ఊరడి రంజిత్ (9వ)

రామారెడ్డి, ఆగస్టు 15: విష జ్వరంతో విద్యార్థి మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భూంపల్లికి చెందిన మహిపాల్, చైతన్య దంపతులు కొడుకు ఊరడి రంజిత్ (9) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో స్థానిక ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించుకోగా నయం కాలేదు. బుధవారం జ్వరం తీవ్రతరం కావడంతో మెరుగైన చికిత్స కోసం కామారెడ్డికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రంజిత్ స్థానిక ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. విద్యార్థి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇదిలా ఉండగా గ్రామంలో కొన్ని రోజులుగా విషజ్వరాలు ప్రబలుతున్నట్లు తెలిసింది. పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని, అధికారుల నిర్లక్ష్యంతోనే విద్యార్థి మృతి చెందాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రంజిత్ మృతి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకొని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పడిగెల రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు.